అవార్డుల గని ఆర్కే 6

- ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో మొదటిస్థానం
- ఇప్పటికే ఐదుసార్లు అవార్డులు
- కంపెనీస్థాయిలో ఆదర్శం

7



చేనేత కార్మికులను ఆదుకునేలా..

- చేనేతకు చేయూత, నేతన్నకు భద్రత, చేనేత భరోసా
- మూడు పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

6



కాగజ్‌నగర్‌లోని చేనేత కేంద్రం

న్యూస్ బాక్స్

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించాలి

బెల్లంపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ చదువుతున్న 1, 3, 5 సెమిస్టర్ల విద్యార్థులు పరీక్ష ఫీజును ఈ నెల 30లోగా చెల్లించాలని ప్రిన్సిపాల్ కాంపెల్లి శంకర్, స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఏకాంబరంలు ఒక ప్రకటనలో తెలిపారు. సెమిస్టర్‌కు సంబంధించిన పరీక్షలు మార్చిలో జరుగుతున్నాయన్నారు.

నేడు సంకటహర చతుర్థి

నస్పూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీ లక్ష్మి గణపతి ఆలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మహా కుంకుమాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ఉదయం లక్ష్మీగణపతి హోమం, సాయంత్రం 108 కిలోల కుంకుమతో మహా కుంకుమాభిషేకం జరుగుతుందన్నారు. భక్తులు స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీక రించాలని వారు కోరారు.

పశువైద్య శిబిరం

జన్నారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ గ్రామంలో గురువారం ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ, పశు వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శంకర్, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి కార్యనిర్వహక అధికారి రామారావు రాథోడ్‌లు మాట్లాడుతూ 26 గేదెజాతి పశువులు, 39 ఆవులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేశామన్నారు. 19 దూడలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. పశువైద్యాధికారి శ్రీకాంత్, మాజీ సర్పంచు జాడి గంగాధర్, కార్యదర్శి లావణ్య, సిబ్బంది యాకూబ్ అలీ, సంజీవ్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ రవి, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న అసాంఘిక చర్యలు



- వరుస ఘటనలతో భయాందోళనలో ప్రజలు
- అదుపు తప్పుతున్న శాంతిభద్రతలు
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల పరస్పర ఫిర్యాదులు

మంచిర్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కక్షలు, భౌతిక దాడులతో జిల్లా కేంద్రం అట్టుడుకుతోంది. ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటున్న అల్లరి మూకలు అదునుచూసి, గ్యాంగులతో కలిసి ప్రత్యక్షదాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల వరుసగా జరుగుతున్న సంఘటనలు సామాన్య ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఎప్పుడు, ఎవరిపైన దాడులు జరుగుతాయో తెలియని పరిస్థితులు నెలకొనగా శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. పోలీసులకు పరస్పర ఫిర్యాదులు చేస్తుండటంతో ఎవరిపై ఎవరు దాడిచేసి కొట్టారో అర్థంకాని గందరగోళ పరిస్థితులు ఉన్నాయి. తాజాగా ఈనెల 15న ఉదయం చేపల మార్కెట్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు మిట్టపల్లి జయరామారావుపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి కొట్టారు. దాడి కాంగ్రెస్ పార్టీ నాయకుల పనేనని పేర్కొంటూ బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, తమకు సంబంధంలేని గొడవను ఆపాదించడాన్ని తీవ్రంగా పరిగణించిన కాంగ్రెస్ నాయకులు బీజేపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం డీసీపీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు.

దాడులతో గుబులు...

మంచిర్యాల పట్టణంలో అభివృద్ధితోపాటు అసాం ఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. జనాభా పెరు గుతుండటంతో అక్రమ దందాలు కూడా అడ్డగోలుగా విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ బిజినెస్ కొత్తపుంతలు తొక్కుతోంది. ప్రభుత్వ స్థలాలు, పట్టా భూములను కబ్జా చేయడం, అందులో అక్రమ నిర్మా ణాలు చేపట్టడం, ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురి చేయడం పెరిగిపోవడంతో పట్టణంలో భయానక వాతావరణం నెలకొంది.

పెరిగిన సెటిల్‌మెంట్‌లు....

జూదం, వ్యభిచారం, సెటిల్‌మెంట్లు, గంజాయి వినియోగం, మారణాయుధాల వాడకం జిల్లా కేంద్రంలో పెరిగిపోయింది. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అక్రమార్కులు వచ్చి ఇక్కడ దందాలు నిర్వహిస్తున్నారు. ఎదురు తిరిగిన వారిని మారణాయుధాలతో చంపేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కత్తులు, తల్వార్‌లు, తుపాకులు, ఇతర మారణాయుధాలతో సంచరిస్తూ సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట దాడులు జరుగుతుండటం హింసాకాండను తలపిస్తోంది.

ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు...

- బీఆర్‌ఎస్ నాయకుడు గడప రాకేష్‌పై జూన్ 2న హైటెక్‌సిటీ సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హాకీ స్టిక్స్‌తో దాడి చేశారు. అనంతరం రాకేష్‌పై దాడిచేసినట్లుగా... భావిస్తున్న వారిపైనా పరస్పర దాడులు జరిగాయి.
- పట్టణంలోని తిలక్‌నగర్‌లో బతుకమ్మ సంబరాల సందర్భంగా కొందరు యువకులు ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరు యువ కులపై దాడికి పాల్పడ్డారు. పాతగొడవల కారణంగా దాడులకు పాల్పడగా పోలీసులు అరెస్టు చేసి, జైలుకు పంపారు.
- హమాలివాడ సప్తగిరి కాలనీలో తోట విశాల్ అనే యువకుడిపై స్థానికులు కొందరు దాడిచేసి కొట్టారు.

మిగతా 7లో

అవకతవకలు లేకుండా సర్వే చేపట్టాలి

లక్షెట్టిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అవకతవకలు, పొరపాట్లు లేకుండా రైతు భరోసా, రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపిక జాబితాను తయారు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపాలిటీలోని 5వ వార్డు, మండలంలోని ఎల్లారం, గుల్లకోట గ్రామంలో సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఫలాలు అందించేందుకే అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు ద్వారా అర్హులైన లబ్ధిదారునికి పథకాలు, ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. రేషన్‌కార్డు దరఖాస్తుల పూర్తి వివరాలను నమోదు చేయా లని, నిబంధనలు తప్పకుండా పాటించాల న్నారు. మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో సరోజ తదితరులు ఉన్నారు.



ఎల్లారం, చింతపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రజలకు అందించే విధంగా అధికారులు పని చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ముత్యంపేట, చింతపల్లి, మేదరిపేట గ్రామాల్లో కొనసాగుతున్న రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను అధికారులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ఎంపికపై సమగ్ర విచారణ జరిపి జాబితా రూపొందించాలని ఆదేశించారు. రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న వారి వార్షిక ఆదాయం 1లక్ష 50వేలు, ఎకరం భూమిలోపు ఉన్న వారు అర్హులన్నారు. రేషన్‌కార్డులో పేర్ల తొలగింపు, చేర్పులు, నూతన రేషన్ కార్డులకు అర్హత గల వారి జాబితాను రూపొందించాలన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామాల్లో జరిగే గ్రామసభలో ఎంపిక చేసిన లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలన్నారు. తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో ప్రసాద్, ఏవో అంజిత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ విజయ, ఆర్ఐ భూమన్న, ఏఈవోలు, కార్యదర్శులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...



బెహరన్‌గూడ వెళ్లే రహదారి కడెం ప్రధాన కాలువపై ప్రమాదకరంగా ఉన్న కర్ర స్తంభం

దండేపల్లి, జనవరి16(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో వాటిని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది సరిచేయడం లేదు. దీంతో స్థానికులే కర్ర స్తంభాలు ఏర్పాటు చేసుకొని లూజ్‌లైన్లు సరిచేసుకుంటున్నారు. మండలంలోని తానిమ డుగు నుంచి బెహరన్‌గూడ వెళ్లే రహదారి, కడెం ప్రధాన కాలువ రోడ్డు పక్క వేలాడు తున్న తీగలకు స్థానికులు కర్ర విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ప్రమాదం జరగ ముందే లూజ్‌వైర్లు సరిచేసి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హత గల ప్రతీ ఒక్కరికి పరిహారం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల- వరంగల్- ఖమ్మం- విజయవాడ జాతీయ రహదారి 163జీ నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన వివరాలను ఆర్డీవో శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. కార్యాలయానికి వచ్చిన బాధితులతో మాట్లాడారు. రహదారి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఓరియంట్ ఎన్నికలు జరిగేనా?

- గడువు ముగిసి మూడేండ్లు
- నేడు ఆదిలాబాద్ డీసీఎల్‌లో సమావేశం

కాసిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణపై చిక్కుముడి వీడడం లేదు. 2019 అక్టోబర్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. గడువు ముగిసి మూడేండ్లు దాటినా అధికారులు ఎన్నికల ఊసెత్తకపోవడంపై ఆదివాసీ లోకల్ యూనియన్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎల్ (డిస్ట్రిక్ కమిషనర్ లేబర్) కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. అయినప్పటికీ ఓరియంట్ కంపెనీ యాజమాన్యం, కార్మిక శాఖ స్పందించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీలో 265 మంది కార్మికులు ఉన్నారు. ఆదిలాబాద్ డీసీఎల్‌లో శుక్రవారం నిర్వహించే సమావేశంలోనైనా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసి ఎన్నికలు నిర్వహించాలని కార్మికులు కోరుతున్నారు.

● పట్టించుకోని అధికారులు

ఓరియంట్ సిమెంట్ కంపెనీలో 5 ఏండ్లకు ఒకసారి కార్మికుల పనితీరు, హాజరు శాతాన్ని బట్టి గ్రేడింగ్ ప్రకటించాలి. క్వార్టర్ అలాట్‌మెంట్ చేయాలి. నిబంధనలను విస్మరించి గుర్తింపు సంఘానికి అనుకూలంగా ఉన్న కార్మికులకే గ్రేడింగ్, క్వార్టర్లను కేటాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులకు సమస్యలు చెబితే గుర్తింపు సంఘం ద్వారా మాట్లాడాలి కానీ నేరుగా మాట్లాడే అవకాశం కార్మికులకు లేదని అధికారులు చెబుతున్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ చెల్లింపు, జీతాల్లో పెరుగుదల, గ్రేడింగ్ నిలిచిపోవడంతో కాంట్రాక్టు కార్మికులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు గైర్హాజరైన కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారు. సమస్యలు చెప్పడానికి గుర్తింపుసంఘం లేకపోవడంతో కార్మికులు ఆవేదన చెందుతున్నారు.



దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ

● యాజమాన్యం మార్పుతో అయోమయం

ఓరియంట్ సిమెంట్ కంపెనీని బిర్లా యాజమాన్యం ఇటీవల అదాని సంస్థకు అమ్మకానికి పెట్టింది. దీంతో కంపెనీ లావాదేవీలు, మార్పులు, చేర్పులు వేగంగా సాగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఓరియంట్ కాస్తా అదాని గ్రూపులోకి..

మిగతా 7లో

ఆదివాసీ గిరిజనులు మూఢనమ్మకాలు వీడాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కాసిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనులు మూఢ నమ్మకాలను విడనాడాలని ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం దేవాపూర్ పంచాయతీ పెద్దాపూర్‌కొలాంగూడలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, అయినప్పటికీ కొందరు ఆదివాసీ గిరిజనులు నాటు వైద్యాన్ని నమ్మి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలను అందిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన గూడాల్లో మెగా వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. గిరిజనులు గూడాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, గట్రావుపల్లిలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం, రహదారి సౌకర్యాలను మెరుగుపర్చాలని పీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆదివాసీ గిరిజనులు సంప్రదాయ వాయిద్యాలతో పీవోకు స్వాగతం పలికారు. కొమురంభీం జెండా గద్దె వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 178 మందికి పరీక్షలు నిర్వహించి 35 మంది రక్తనమూనాలను సేకరించారు. డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఐటీడీఏ అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, ఆర్‌ఎంవో డాక్టర్ భీష్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవికిరణ్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ కోటేశ్వర్

బెల్లంపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కోటేశ్వర్ అన్నారు. గురువారం బెల్లంపల్లిలోని వంద పడకల ఏరియా ఆసుపత్రిని పరిశీలించి మాట్లాడారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ డెలివరీలు చేస్తున్నామని, గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులతోపాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఆసుపత్రిలో ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యుడు కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ నాయకుడు మెట్టుపల్లి జయరామారావుపై కాంగ్రెస్ గుండాలు దాడి చేశారని, దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. గురువారం బీజేపీ కార్యాలయం నుంచి డీసీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి డీసీపీకి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో యేడాది నుంచి ప్రతిపక్ష నాయకులపై దాడులు జరుగుతున్నాయన్నారు. జయరామారావుపై ముగ్గురు యువకులు దాడి చేయడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. ఒక్క వ్యక్తి ఎమ్మెల్యే పేరు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నా ఎమ్మెల్యే స్పందించడం లేదన్నారు. నాయకులు అశోక్, పురుషోత్తం, వెంకటేశ్వర్‌గౌడ్, ముకేష్‌గౌడ్, ఆంజనేయులు, రాజు, హేమంత్‌రెడ్డి, లచ్చన్న, గురువయ్య, పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి



డీసీపీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుపై దుష్ప్రచారాలు చేస్తున్న బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని గురువారం డీసీపీకి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జయరామారావుపై జరిగిన భౌతిక దాడిని కాంగ్రెస్ పార్టీకి అంటగట్టడం మంచిది కాదన్నారు. ప్రేంసాగర్‌రావు చేస్తున్న అభివృద్ధి పనులను ఓర్వలేకనే వ్యక్తిగత గొడవలను ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ పార్టీకి ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. కావాలనే బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్‌రావు, ముఖేష్‌గౌడ్‌లు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నాయకులు చిట్ల సత్యనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది



సీపీ శ్రీనివాస్‌కు మొక్క అందజేస్తున్న పదోన్నతి పొందిన అధికారులు

మంచిర్యాల క్రైం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితోపాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కష్టపడి పని చేసి పోలీసు శాఖకు పేరు తేవాలని ఆయన కోరారు. సర్వీసు పూర్తి చేసి మరిన్ని పదోన్నతులను పొందాలని సూచించారు. చెన్నూరుతోపాటు మంచిర్యాల స్టేషన్ పరిధిలో పదోన్నతి పొందిన వారిని ఆయన సన్మానించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేందర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్ పాల్గొన్నారు.

18న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 18న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఇందుకోసం జిల్లాలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● ఎస్సై విక్రమ్, బెజ్జూరు



ఆంధ్రజ్యోతి : రోడ్డు భద్రత నియమాల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : ప్రస్తుతం రోడ్డు భద్రత నియమాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నాం. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తు న్నాం. హెల్మెట్ ధరించని వారి వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. నియమావళిని ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : వాహనాల వేగ నిరోధకానికి ఎలాంటి చర్యలు తీసు కుంటున్నారు.

ఎస్సై : యువకులు మితిమీరిన వేగంతో వాహనాలను పడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా చర్యలు చేపడుతున్నాం. ముఖ్యమైన ప్రదేశాల్లో వేగనిరోధకాలను ఏర్పాటు చేయిస్తు న్నాం. గ్రామాల్లో ప్రతిచోట తనిఖీలు నిర్వహిస్తూ ఆయా వాహనదారులకు జరిమానాను వేదిస్తున్నాం.

బెజ్జూరు, ఆంధ్రజ్యోతి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిర్పూర్(టి), జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సోనులే రవీం దర్ నెలరోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టు కోగా గురువారం బాధితుడికి ఎస్సై కమ లాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్ల యితే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయా లన్నారు.

చేనేత కార్మికులను ఆదుకునేలా..

- చేనేతకు చేయూత, నేతన్నకు భద్రత, చేనేత భరోసా
- మూడు పథకాలను ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

"చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం చేనేతకు చేయూత, నేతన్నకు భద్రత, చేనేత భరోసా అనే మూడు పథకాలు అమలు చేసేం దుకు ఇటీవల జీవో విడుదల చేసింది. ఆయా పథకాల ద్వారా చేనేత కార్మికులకు ఆర్థిక తోడ్పాడునందిచడానికి చర్యలు తీసుకుంటోంది. పథకాల అమలుపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు." - కాగజ్‌నగర్



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు(ఫైల్)



చేనేత కేంద్రంలో పని చేస్తున్న కార్మికుడు

ప్రస్తుత పోటీప్రపంచంలో చేనేతకు రంగం కుదే లైంది. జిల్లాలో నెలకు 1500 మీటర్ల ఖాదీ దుస్తులు తయారుచేసే కేంద్రాలు ఆదరణలేక మూసివేయబ డ్డాయి. ఉన్న కేంద్రాల్లో చేనేత దుస్తులకు బదులుగా దుప్పట్లు, బెడ్‌షీట్‌లు తయారు చేస్తున్నారు. జిల్లాలో కేవలం కాగజ్‌నగర్ పరిధిలోనే చేనేత సహకార సంఘం నడుస్తోంది. ఈ సొసైటీలో 23మంది కార్మికులు పని చేస్తున్నారు. ఒక్కొక్కరికి సగటున నెలకు రూ.5వేలు రాని పరిస్థితి ఉంది. ఒకవైపు పెరుగుతున్న ధరలు మరోవైపు చాలీచాలని పీస్‌వర్క్ రేటుతో దయనీయంగా కాలం వెళ్లదీస్తున్నారు. నిత్యం చేనేత ఉత్పత్తులు తయా రు చేస్తుండగా కనీసం అనారోగ్యం బారినపడితే వచ్చిన జీతం వైద్యఖర్చులకు కూడా సరిపోని పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయంతో వీరందరి బాధలు గట్టెక్కనున్నాయి.

● ప్రభుత్వం అమలు చేసిన పథకంతో జిల్లాలోని చేనేత కార్మికులు తమ ఆదాయంలో రూ.8శాతం బ్యాంకులో పొదుపు చేసుకుంటే ప్రభుత్వం మరో రూ.8శాతం వీరి అకౌంటులో జమ చేయనుంది. అర్హతను బట్టి ఈ పొదుపు డబ్బులు నేరుగా కార్మికుడి ఖాతాలో జమ అవుతాయి.

● వీటితో పాటు తెలంగాణ హ్యాండ్‌లూం కార్పొరే షన్ ద్వారా రూ.5లక్షల బీమా వర్తింప చేయనుంది. విధి నిర్వహణలో కార్మికుడు మృతిచెందితే వారి కుటుంబా నికి ఈ బీమా డబ్బులు అందజేయనున్నారు.

● అదే విధంగా కూలీలు పనిచేసే విధానం బట్టి సాలీన ప్రతి కార్మికుడికి గరిష్ఠంగా రూ.18వేలు ఖాతాలో జమ చేసేందుకు నిర్ణయించింది. ఈ మూడు పథకాలు అమలు చేసేందుకు దిశానిర్దేశం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంపై చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో మేలు..



రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేనేత రంగానికి ఊతమిచ్చేట్టు చక్కటి ని ర్ణయం తీసుకుంది. జీవోలో పేర్కొన్న మూడు స్కీంలు అమలు చేస్తే మా కష్టాలు గట్టెక్కుతాయి. సీఎం సారుకు రుణపడి ఉంటాం.

-రాజమౌళి, కార్మికుడు, కాగజ్‌నగర్

ఎంతో హర్షనీయం..



రాష్ట్ర ప్రభుత్వం మూడు స్కీం అమలు చేసేందుకు జీవో విడుదల చేయటం ఎంతో హర్షణీయం. 8శాతం పొదుపు చేస్తే 16శాతం నేరుగా కార్మికుల అకౌంటులోనే జమ అవుతుంది. అలాగే బీమా వర్తింపు చేయటం చాలా చక్కటి నిర్ణయం. వీటితోపాటు కేవలం అర్హులైన కార్మికుల కష్టానికి గుర్తింపుగా ఏటా రూ.18వేలు ఖాతాలో జమచేయాలని తీసుకునే నిర్ణయం చాలా మంచింది. చేనేత కార్మిక రంగం సీఎం గారికి ఎప్పటికీ రుణ పడి ఉంటుంది.

-కనకయ్య, చేనేత కేంద్రం అధ్యక్షుడు, కాగజ్‌నగర్

అట్రాసిటీ కేసు నమోదు

కాసిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దిమాడ మాజీ సర్పంచు ఆడె జంగును దేవాపూర్ చెందిన ఇప్పకాయల రాకేష్ కులం పేరుతో దూషిం చినందుకు రాకేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు గురువారం తెలిపారు. ఈ నెల 9న ఓరియంట్ సిమెంట్ కంపెనీ గేటు వద్ద ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో రాకేష్ జంగును కులం పేరుతో దుర్భాష లాడగా 10వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా గురువారం బెల్లంపల్లి ఏసీపీ రవికు మార్ దేవాపూర్ కంపెనీ గేటు వద్ద ప్రాథమిక విచారణ చేపట్టి సాక్ష్యుల నుంచి వాంగ్మూలం నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రైలులో మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు బెల్లంపల్లి రైల్వే పోలీసులు తెలిపారు. రవీంద్రఖని రైల్వేస్టేషన్ నుంచి ప్యాసింజర్ రైలులో రేషన్ బియ్యం బస్తాలు ఎక్కించి తరలిస్తుండగా బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నామ న్నారు. పట్టుకున్న 24 క్వింటాళ్ల బియ్యం విలువ లక్ష రూపా యలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేత జట్టుకు నగదు, ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

గర్మిళ్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని శివాజీ గ్రౌండ్‌లో పది రోజులుగా జరుగుతున్న ఎంపీఎల్ సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో జీటీ జట్టు విన్నర్‌గా, ఎస్ఆర్‌హెచ్ ఎన్‌టీఆర్‌నగర్ జట్టు రన్న ర్‌గా నిలిచింది. విజేత జట్టుకు లక్ష రూపాయల ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీని అంజనీపుత్ర అధినేత గుర్రాల శ్రీధర్, ఎండీ పిల్లి రవితలు అందజేశారు. రన్నర్ జట్టుకు వసుధ ఆసుపత్రి సన్ని పటేల్, కెల్విన్ ఆసుపత్రి కొమ్ము శ్రీనివాస్, ఉడారి చంద్రమో హన్‌గౌడ్‌ల చేతుల మీదుగా రూ.50 వేల నగదు అందజేశారు. గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో టోర్నమెంట్ నిర్వహించిన గురూస్ క్రికెట్ అకాడమీ నిర్వాహకులు దుర్గాప్ర సాద్, బింగి శివకిరణ్, వైద్య ప్రశాంత్, శ్రీనివాస్, శివ, లక్ష్మణ్, సంతోష్‌లను అభినందించారు. అంజనిపుత్ర ఎగ్జిక్యూటివ్ డైరె క్టర్‌లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

చెన్నూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపోట ములు సహజమని, ఓడిన వారు గెలుపు కోసం కృషి చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సంక్రాంత పండగను పురస్కరించుకుని ఆస్నాద గ్రామంలో ఉమ్మడి ఆదిలాబాద్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఏసీపీ, చెన్నూరు సీఐ రవీందర్‌లు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకు న్నారు. ఏసీపీ మాట్లాడుతూ క్రీడలకు పోలీసుల సహాయ సహ కారాలు ఉంటాయన్నారు. యువత రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుంద న్నారు. టోర్నమెంట్‌లో 32 టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, మాజీ ఉపసర్పంచు శ్రీనివాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత కిష్టాపూర్ జట్టు



విజేత జట్టుకు నగదు అందజేస్తున్న నిర్వాహకులు

జైపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా మండలంలోని కిష్టపూర్ గ్రామంలో కబడ్డీ పోటీలను నిర్వహిం చారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 10 జట్లు పాల్గొ నగా విజేతగా కిష్టాపూర్ జట్టు గెలువగా, రెండవ బహుమతి ఇందారం జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ.10 వేలను చం దుపట్ల జనార్దన్‌రెడ్డి, ద్వితీయ రూ.5 వేలను పాపిరెడ్డి అందజే శారు. అలాగే మల్ల సత్తిరెడ్డి కిష్టాపూర్ జట్టు సభ్యులకు రూ. 5 వేల విలువ గల టీషర్ట్‌లు, సామగ్రి అందజేశారు.


ముగిసిన కబడ్డీ టోర్నమెంట్



బహుమతులు అందిస్తున్న నాయకులు, నిర్వాహకులు

కోటపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారు పెల్లి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న కబడ్డీ టోర్నమెంట్ గురువారం ముగిసింది. టోర్నమెంట్‌కు వివిధ జిల్లాల నుంచి 38 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీల్లో వెంక ట్రావుపేట భజరంగ్ జట్టు (లక్షెట్టిపేట) ప్రథమ స్థానంలో నిలు వగా, కాటారం జట్టు (భూపాలపల్లి జిల్లా) ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు రూ. 12,116, ద్వితీయ జట్టుకు రూ.6116 నగదు, ట్రోఫీ అందించారు. జడ్పీ మాజీ చైర్మన్ మూల రాజిరెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాంచందర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ చంద్రశేఖర్, జిల్లా జాయింట్ సెక్రటరీలు మల్లయ్య, రవి, పీఈటీలు డాక్టర్ దాసరి మల్లేష్, నిర్వాహకులు బోగె ప్రేంకుమార్, మచ్చ నరేష్, సాయికిరణ్, తోట సాయికుమార్, పాల్గొన్నారు.

కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి జయంతి



హైదరాబాద్‌లో జైపాల్‌రెడ్డి జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రి టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గురువారం కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతి కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి హాజరయ్యారు. జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిం చారు. తెలంగాణ సాధన కోసం ఎంపీలను ఏకం చేసిన నాయ కుడని పేర్కొన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డుతోపాటు అందరికి ఆదర్శంగా పనిచేశాడని కొనియాడారు.

మండలాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

కాగజ్‌నగర్ టౌన్/ చింతలమానేపల్లి/ తిర్యాణి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నియ మించిన బీజేపీ నూతన మండల అధ్యక్షు లకు గురువారం నియా మక పత్రాలు అందజే శారు. స్థానిక బీజేపీ కార్యాయల యంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఈ పత్రాలు అందజేశారు. చింతలమానేపల్లి మండల అధ్యక్షుడుగా డోకె రామన్న, తిర్యాణి మండల అధ్యక్షుడుగా రమేష్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎల్ములే మల్లయ్యను నియ మించగా వారికి నియా మకపత్రాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ కార్య దర్శి శ్రీశైలం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



లావణ్య



డోకె రామన్న

సిర్పూర్(టి): బీజేపీ మండలా ధ్యక్షురాలిగా మాజీ ఉపసర్పంచ్ చన్నపురి రాజక్క(లావణ్య)ను పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. లావణ్య గతంలోకూడా బీజేపీ మండలమహిళా మోర్చా అధ్యక్షురాలిగా కొనసాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

సమష్టిగా పనిచేసి ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సమష్టిగా పని చేసి నిర్దేశించిన ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీరావు అన్నారు. సింగరేణి ముద్రించిన 2025క్యాలెండర్‌ను గురువారం గని ఆవరణలో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఉద్యోగులు ఉత్పత్తి, ఉత్పాదకతపై దృష్టిసారించాలని సూచించారు. సంస్థ అభివృద్ధిని తమ వృద్ధిగా భావించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ నాయకులు చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, అధికారుల సంఘం ప్రతినిధి కమ్రుద్దీన్, శంకర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

తాండూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాండూర్ లోని కుమ్మరివాడకు చెందిన నిరుపేద చాకలి లచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందగా అతనికి వార సులు ఎవరూ లేకపోవడంతో కాంగ్రెస్ నాయకులు గురువారం దహనసంస్కారాలు నిర్వహించారు. స్థానికులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్‌కు తెలపడంతో వాడలోని పెద్ద మనుషుల సహాయంతో కాంగ్రెస్‌నాయకులు పాడె మోసి దహన సంస్కారాలు నిర్వహించారు. ఇందులో శ్రీను, రఘు, మహేందర్, సింగారావు, శ్రీధర్, రవి, యువకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, జనవరి 16: (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొం దుతూ గురువారం మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన డోకే అజయ్(20) అనే యువకుడు సుల్తానాబాద్ పట్టణంలోని అశోక్‌నగర్‌లోని తమ బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి మానకొండూరు మండలంలో ఉన్న మరికొందరు బంధువులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై వెలుతుండగా బుధవారం రోజున ఉదయం ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని మొదట కరీంనగర్, ఆ తర్వాత గురువారం ఉదయం ఎంజీఎం వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఎస్టీపీపీలో సమ్మెను విజయవంతం చేయాలి..

జైపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో ఈనెల18న చేపట్టనున్న ఒక్కరోజుటోకెన్ సమ్మెను విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనమాట్లాడారు. సింగరేణి యాజమాన్యం పవర్‌ప్లాంటు కార్మికులను ప్రలోభాలకు గురిచేసి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తోందన్నారు. సింగరేణి యాజమాన్యానికి 2022లో సమ్మె చేస్తున్నామని నోటీసు అందజేసినా కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి శ్రద్ధచూపలేదన్నారు. దానికి అనుగుణంగానే సమ్మెచేపట్టడానికి హెచ్‌ఎంఎస్ సిద్ధమవుతోందన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు సారయ్యలక్ష్మణ్, విక్రమ్‌కుమార్, సాయికృష్ణరెడ్డి, నర్సింహారెడ్డి, సత్యనారాయణచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సమస్యలను త్వరగా పరిష్కరించండి

శ్రీరాంపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కంపెనీకి చెందిన న్యాయ సంబంధ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. సింగరేణి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ హర్షా రెడ్డి గురువారం ఏరియా జీఎంను కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న న్యాయ సంబంధిత అంశాలను హైకోర్టులో త్వరగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీరెడ్డి, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, తదితరులు పాల్గొన్నారు.



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

రెబ్బెన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాల ని కోరుతూ గురువారం బెల్లంపల్లి గోలేటి జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి కాలరీస్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్బర్ అలీ, గోలేటిబ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమ స్యలు ఇంత వరకు పరిష్కరించటం లేదన్నారు. సమస్యలను ప రిష్కరించాలని అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి నప్పటికీ ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. కాంట్రాక్టు కార్మికు లకు హైపవర్‌కమిటీ వేతనాలు చెల్లించాలని సూచించినప్పటికీ ఇంతవరకు ఆచరణలోకి రావటం లేదన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ, వైద్యసౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు మొగిలి, మారం శ్రీనివాస్, నర సయ్య తదతరులు పాల్గొన్నారు.

అధికారులు సంస్థ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

మందమర్రి టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో అధికారులందరూ గనుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ఐఎన్టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్‌ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మ య్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య పేర్కొన్నారు. గురువారం యూనియన్ కార్యాల యంలో వారు మాట్లాడారు. నాలుగు దశాబ్దాల క్రితం అధికారులు గనిని సందర్శించి ఒక్క ప్రమాదం జరగకుండా బొగ్గును వెలికితీశార న్నారు. ఇప్పుడు చదువుకున్న అధికారులు రూఫ్ కండీషన్ బాగాలేదని, పిల్లర్లు కూలుతు న్నాయనే సాకుతో వాటిని మూసివేసేందుకు పూనుకోవడం మంచిది కాదన్నారు. మైనింగ్ చదివిందే బొగ్గును ఏ విధంగా తీయాలి అని. అలాంటిది దానికే స్వస్తిచెబుతూ ఎక్కువ శాతం మూసివేయడానికి మొగ్గు చూపుతున్నారని మండిపడ్డారు. చెన్నూరు నియోజకవర్గంలోని మూడు గనులను చిన్నచిన్న సాకు లతో మూసివేశారన్నారు. కేకే1గనిలో పంపులు ముని గాయని మూసివేశారని, కేకే2గనిని కూడా మూసివేశా రని అన్నారు. బెల్లంపల్లి రీజియన్‌లో మూసివేసిన గను లపై తమయూనియన్ నాయకులు జనక్‌ప్రసాద్ నేతృత్వంలో ఆందో ళన చేపడుతున్నామని తెలిపారు. త్వరలో నివే దిక తయారుచేసి ప్రభుత్వానికి అందజేయను న్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు శంకర్‌రావు, రాంశెట్టి నరేందర్, మండ భాస్కర్, పానుగంటి వెంకటస్వామి, అన్ని గనుల పిట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

ఐఎన్‌టీయూసీ ప్రధానకార్యదర్శిగా ఏనుగు రవీందర్ రెడ్డి



ఏనుగు రవీందర్ రెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్‌మైన్స్ లేబర్‌యూని యన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధానకార్యదర్శిగా ఏను గు రవీందర్‌రెడ్డి నియమి తులయ్యారు. ఈ మేరకు యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ బి జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1983లో సింగరేణి ఉద్యోగంలో చేరిన ఏనుగు రవీందర్ రెడ్డి 1985 నుంచి ట్రేడ్‌యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొం టున్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2003లో శ్రమశక్తి అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం సింగరేణి లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ వర్కర్స్ యూని యన్, శ్రీరాంపూర్ ఏరియా వెజిటేబుల్ మార్కె ట్ యూనియన్ అధ్యక్షుడిగా ఉన్నా రు. తన నియామ కానికి సహకరించిన ఐఎన్‌టీయూసీ ఆల్‌ఇండియా అధ్యక్షుడు జి సంజీవరెడ్డికి, సెక్రెటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్‌కు ఏనుగు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

మందమర్రి టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సింగ రేణిసంస్థ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయా లని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్వాలిడేషన్ కింద ఉద్యోగంలో చేరుతున్న డిపెండెంట్ల ఉద్యోగపత్రాల పంపిణీకి ఆయన హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు 1806మందికి పత్రాలు అందజేశామన్నారు. ఐదు సంవ త్సరాలపాటు అండర్‌గ్రౌండ్‌లో విధులు నిర్వహించాల న్నారు. ఉన్నతవిద్య కలిగిన వారు డైరెక్టర్ స్థాయి వరకు ఎదిగే అవకాశాలు సింగరేణిలో ఉన్నాయన్నారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

కాసిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై ఈనెల 21 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 21న బుగ్గగూడెం, చిన్న ధర్మారం, గట్రావుపల్లి, కొండాపూర్, కోనూరు, లంబాడితండా(డీ), లంబాడితండా(కే) మామిడిగూడెం, పెద్దనపల్లి, రొట్టెపల్లి, సోమగూడెం(కే) జరుగుతాయి. 22న దేవాపూర్, ధర్మారావుపేట, కాసిపేట, కోమటిచేను, మద్దిమాడ, మల్కేపల్లి, ముత్యంపల్లి, పల్లంగూడ, సోనాపూర్, తాటిగూడెం, వెంకటాపూర్ గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయన్నారు. ప్రజలు హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మందమర్రిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆదిల్‌పేట గ్రామానికి చెందిన దుర్సి కత్తెరసాల అనే వ్యక్తికి మంజూరైన రూ.40 వేల సీఎం సహాయ నిధి చెక్కును గురువారం మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందె రాంచందర్ అందజేశారు. మాజీ సర్పంచులు నర్సింగోజు తిరుపతి, గోదరి రాజేష్, పున్నం, ఆకుల అంజి, రాజలింగు, ఆకుల చందు, ఎనగందుల మల్లేష్, హనుమాండ్ల అంజి పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

తాండూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌నగర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న నర్సరీ పనులను ఉపాధిహామీ ఏపీవో నందకుమార్ గురువారం పరిశీలించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దని, రోజు నీరు పోయాలని సూచించారు. వచ్చే హరితహారం నాటికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వసంత, టెక్నికల్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, వనసేవక్ శ్రీనివాస్ ఉన్నారు.

ఆర్థికసాయం

దండేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మంద రాజు డిసెంబర్ 31న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతని భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందగా వారి కూతురు ఉంది. విషయం తెలుసుకున్న దండేపల్లి ఉన్నత పాఠశాలలో 2004-05 ఎస్‌ఎస్‌సి బ్యాచ్ బాల్యమిత్రులు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాల్య మిత్రుడు రాజు కూతురుకు రూ. 10వేల నగదు అందజేశారు.

కార్యవర్గం ఏర్పాటు

లక్షెట్టిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండల ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా కోడి రత్నయ్య, ప్రధానకార్యదర్శిగా చిన్నయ్య, ప్రచార కార్యదర్శిగా నర్సయ్య, బండారి స్వామి, కోడి చంద్రయ్య, జాడి ప్రశాంత్ కుమార్, పెరుగు గురువయ్యలను ఎన్నుకొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రోడ్డు భద్రతపై కళాజాతా

దండేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి బస్టాండ్ వద్ద గురువారం రోడ్డు భద్రతపై కళాకారులు ఆటాపాటతో ప్రజలకు అవగాహన కల్పించారు. బైక్‌పై వెళ్లేవారు హెల్మెట్, ఫోర్‌వీల్స్ నడిపేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపవద్దన్నారు. ముల్కల మురళి, నాగలక్ష్మి, నిరోషా, శ్రీనివాస్, పోషన్న, రవికుమార్ పాల్గొన్నారు.

అవార్డుల గని ఆర్‌కే 6



ఆర్‌కే 6 గని ముఖ ద్వారం

- ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో మొదటిస్థానం
- ఇప్పటికే ఐదుసార్లు అవార్డులు
- కంపెనీస్థాయిలో ఆదర్శం

శ్రీరాంపూర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6 గనికి అవార్డుల పంట పండుతోంది. రికార్డులు సాధిస్తున్న గనిగా పేరొందింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్ సెక్షన్‌లో 2020 నుంచి అధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తూ వస్తోంది.

యాభై ఏళ్ల గని

ఏరియాలోని ఆర్‌కే 6 గని 1975 ఏప్రిల్ 6న ప్రారంభమైంది. ఈ గనిలో 29.80 మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, 14.79 మెట్రిక్ టన్నుల బొగ్గును తీసేందుకు నిర్ణయించగా 13.95 మెట్రిక్ టన్నుల బొగ్గును వెలికితీశారు. ఇంకా 0.20 మెట్రిక్ టన్నులు తీయాల్సి ఉంది. ఇందులో 4, 5 సీమ్‌లు పని చేస్తున్నాయి. ఈ గని ఇంకా ఏడాది వరకు నడిచే అవకాశం ఉంది.

అన్నీ రికార్డులే

గనిలో 765 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. 2006లో మ్యాన్ రైడింగ్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారు. ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను 2012లో వినియోగంలోకి తీసుకువచ్చారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 90 శాతంతో 4 స్టార్ రేటింగ్, 2023-24లో సైతం 94 శాతంతో 4 స్టార్ రేటింగ్‌ను సాధించింది.

ఎస్‌డీఎల్‌లో ఐదేళ్లుగా అవార్డులు

ఎస్‌డీఎల్ యంత్రాలను 2008 నుంచి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం 6 ఎస్‌డీఎల్‌లతో బొగ్గు ఉత్పత్తిని సాధిస్తున్నారు. ఒక ఎస్‌డీఎల్‌తో రోజుకు 110 టన్నులకుపైగా ఉత్పత్తి చేస్తున్నారు. ఆరు యంత్రాలతో ఒక రోజుకు సరాసరిగా 600 టన్నుల బొగ్గును తీస్తున్నారు. కంపెనీ వ్యాప్తంగా ఇతర గనుల్లో 95 టన్నుల వరకే బొగ్గును తీస్తున్నారు. 2024 డిసెంబరు 23న కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో సంస్థ సీఎండీ ఎన్. బలరాం చేతుల మీదుగా గని అధికారులు, ఉద్యోగులు అవార్డును అందుకున్నారు.

ఎస్‌డీఎల్ సాధించిన బొగ్గు ఉత్పత్తి

సంవత్సరం	రోజుకు ఉత్పత్తి	ఉత్పత్తి శాతం (మెట్రిక్ టన్నుల్లో)
2019-20	173	114
2020-21	155	88
2021-22	130	101
2022-23	114	116
2023-24	107	108

ఐదేళ్లు వరుసగా అవార్డులు..

ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అధిక ఉత్పత్తి సాధిస్తున్న గనుల్లో ఆర్‌కే 6 గని 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఎస్‌డీఎల్ విభాగంలో వరుసగా అవార్డులు సాధిస్తున్నది. ప్రణాళికతో పని చేయడం వల్ల రికార్డులు సాధ్య మవుతున్నాయి. ప్రతీ ఎస్‌డీఎల్ యంత్రానికి రెండు వర్కింగ్ ప్లేస్‌లు కేటాయించడం, టబ్బుల ట్రాక్‌లైన్‌ను యంత్రానికి అందుబాటులో ఉండేలా చూడడం, యంత్రాలు బ్రేక్‌డౌన్ లేకుండా చూసుకోవడం ఉత్పత్తి ఎక్కువ సాధించడానికి అవకాశం కల్పిస్తున్నారు. అయితే సంస్థకు లాభసాటిగా ఉన్న ఈ గని మరో ఏడాది పాటు మాత్రమే నడుస్తుందని అధికారులు చెప్తున్నారు.



అందరి సహకారంతోనే...



ఏరియా జీఎంతోపాటు ఉన్నతాధికారుల సహకారం తో ముందుకు వెళ్తున్నాం. గని కంపెనీ స్థాయిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి బెస్ట్ ఎస్‌డీఎల్ పెర్ఫా ర్మెన్స్ అవార్డు అందుకున్నాం. ఉద్యోగులు, సూపర్ వైజర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేశారు.

- ఈ. తిరుపతి, మేనేజర్, ఆర్‌కే 6 గని

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి



నర్సింగాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్, నస్పూర్‌లో వార్డు ఆఫీసర్లతో మాట్లాడుతున్న కమిషనర్

భీమారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందాలనే ఉద్దేశ్యంతో మండలంలో క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తున్నామని మండల స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ జేడీ కల్పన పేర్కొన్నారు. గురువారం నర్సింగాపూర్, ధర్మారం, దాంపూర్, ఖాజీపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చేస్తున్న రేషన్ కార్డు, రైతు భరోసా సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు సంక్షేమ ఫలాలు అందకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఏపుగా పెరిగేలా సంరక్షించాలని, రోజు నీరు పోయాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను రోజు చేపట్టాలన్నారు. ఎంపీడీవో మధుసూదన్, ఏఈవో అరుణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నస్పూర్, (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల దరఖాస్తులపై చేపట్టిన సర్వేను జాగ్రత్తగా చేయాలని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ పలు సూచనలు ఇచ్చారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 1305 రేషన్ కార్డుల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతీ దరఖాస్తును పరిశీలించి జాబితా తయారు చేయాలని సూచించారు. అనంతరం వార్డుల్లో చేపట్టిన సర్వే తీరును పరిశీలించారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): బోయపల్లి, తాండూర్, మాదారం, కిష్టంపేట, రేపల్లెవాడ గ్రామాల్లో అధికారులు సాగుకు యోగ్యం కాని భూముల వివరాల సర్వే నిర్వహించారు. సాగుకు అనుకూల భూములకు మాత్రమే పెట్టుబడి సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో 24 గ్రామాలకు బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండల స్పెషల్ ఆఫీసర్ అంజయ్య, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, అగ్రికల్చర్ ఆఫీసర్ సుష్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎజాజ్‌ఉద్దీన్, ఎంపీవో అనిల్ పాల్గొన్నారు.

వేమనపల్లి, (ఆంధ్రజ్యోతి): జిల్లెడ, జక్కెపల్లి గ్రామాల్లో జరుగుతున్న రైతు భరోసా సర్వేను తహసీల్దార్ రమేష్ పరిశీలించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి వివరాలను పకడ్బందీగా తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి గ్రామంలో రైతు భరోసాలో భాగంగా సాగుకు అనుకూలంగా లేని భూములను అధికారులు సర్వే చేసి గుర్తించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌ను సర్వేను పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఆర్‌ఐ పద్మజ, ఏఈవో తిరుపతి పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ పథకాల సర్వేకు సహకరించాలని తహసీల్దార్ భోజన్న అన్నారు. పెద్దనపల్లి నాయకపుగూడలో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా పథకాల సర్వేకు బృందాలు గ్రామాల్లో పర్యటిస్తున్నాయని ప్రజలు సహకరించాలని కోరారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డు కాల్‌టెక్స్‌లో కౌన్సిలర్ నెల్లి శ్రీలత ఆధ్వర్యంలో కొత్త రేషన్ కార్డుల కోసం ఇంటింటికి సర్వే నిర్వహించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన వారికి రేషన్ కార్డులను అందిస్తుందని తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి సహకరించాలన్నారు. నాయకులు నెల్లి రమేష్, వార్డు ఆఫీసర్‌పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెరుగుతున్న అసాంఘిక చర్యలు

5వ పేజీ తరువాయి

- అశోక్‌రోడ్డులో దుర్గామాత నిమజ్జనం సందర్భంగా శిరీష్ అనే వ్యక్తిపై డీజే సౌండ్ విషయంలో పలు వురు వ్యక్తులు దాడి చేసి కొట్టారు.
- అక్టోబర్ 10న హమాలివాడలో పోలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కోమటి సత్తయ్యలపై భూమి విషయంలో పలువురు వ్యక్తులు దాడికి పాల్పడి వెంట తెచ్చుకున్న తల్వార్‌తో చంపేందుకు ప్రయత్నించారు. అక్కడి నుంచి తప్పించుకున్న బాధితులు నేరుగా పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనలో మంథని సమీపంలో జరిగిన న్యాయవాద దంపతుల హత్యకేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న కుంట శ్రీనివాస్ పాల్గొనడం కలకలం రేపింది.
- అదే నెల 14న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఇంటిలోకి ముగ్గురు ముసుగు ధరించిన వ్యక్తులు కత్తులతో చొరబడ్డట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వాచ్‌మన్ అడ్డుపడటంతో అతనిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటన లో నిందితులు ఇంకా పట్టుపడకపోగా ఎమ్మెల్యే ఇంట్లోకి దుండగులు ఎందుకు ప్రవేశించారనే సందే హాలు వ్యక్తమవుతున్నాయి. మూడు నెలలు గడిచినా ఎమ్మెల్యే ఇంట్లో చొరబడ్డ దుండగులను పోలీసులు ఇప్పటిదాకా పట్టుకోలేదు.
- అక్టోబర్ 18న హాజీపూర్ మండల మాజీ ఎంపీపీ రమాదేవి భర్త, మాజీ ఎంపీపీ మందపల్లి శ్రీని వాస్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయగా ప్రత్య ర్థివర్గం కూడా శ్రీనివాస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది.
- డిసెంబరు 18న నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకుడు నయీంపాష పైనా కొందరు దాడి చేసి తీవ్రంగా కొట్టారు.

ఓరియంట్ ఎన్నికలు జరిగేనా?

5వ పేజీ తరువాయి

వెళ్లిపోనుంది. అదాని గ్రూపులో కార్మికులు, ఉద్యోగుల మనుగడ ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. కార్మిక సంఘం కనుమరుగయ్యే అవకాశాలు ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఇటీవల గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కార్మికుల ఉద్యోగుల భద్రతపై దీక్ష చేయడం అనుమానాలను మరింత బలపర్చింది.

ఎన్నికలకు మేము సిద్ధం



ఎన్నికలను సకాలంలో నిర్వహించాలి. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నాం. కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నాం. ఎన్నికలపై అధికారులు ఏ నిర్ణయం తీసుకున్నా సహకరిస్తాం.

- ఏనుగు తిరుపతిరెడ్డి, ఓరియంట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ , దేవాపూర్

ఆదివాసీ భూ నిర్వాసితులు నష్టపోతున్నారు ..



ఓరియంట్ సిమెంట్ కంపెనీకి భూములు ఇచ్చిన ఆదివాసీ గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో యాజ మాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. గుర్తింపు సంఘం ఉంటే యాజ మాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించడానికి వీలవుతుంది. కార్మికుల సమస్యలను గాలికి ఒదిలేసి గుర్తింపు సంఘం యాజమాన్యంతో కుమ్మక్కైంది. కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ తరుపున పోరాటం చేస్తాం.

- ఆడె జంగు, లోకల్ ఓరియంట్ సిమెంట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు, దేవాపూర్

మొక్కుబడిగా ఉపాధిహామీ ప్రజావేదిక


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

కాసిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం జరిగిన 14వ విడత ఈజీఎస్ ప్రజావేదిక మొక్కుబడిగా ముగిసింది. 2023 నుంచి డిసెంబరు 31, 2024 వరకు 241 పనులకు రూ.4.85 కోట్ల నిధులను కేటాయించారు. వారం రోజులుగా బృందాలు తనిఖీ చేసి లోపాలను గుర్తించడంలో సామాజిక తనిఖీ బృందం విఫలమైందనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఇద్దరికి మాత్రమే రూ.2 వేలు జరిమానా విధించి రూ.16,166 రికవరీకి ఆదేశించారు. ప్రజావేదిక నిర్వహణ తేదీల్లో అధికారులు స్పష్టమైన తేదీని ప్రకటించకపోవడంతో ఉపాధి కూలీలు కొందరు మాత్రమే హాజరయ్యారు. డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు, ఎంపీడీవో సత్యనారాయణసింగ్,ఎంపీవో సఫ్దర్ అలీ, ఏపీవో నవీన్, ఎస్‌టీఎం వేణు, ఎస్‌ఆర్‌పీ రంజిత్, డీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

తొలగిన తాగునీటి కష్టాలు


తాగునీరు పట్టుకుంటున్న కాలనీవాసులు

కోటపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మల్లంపేట 6వ వార్డు కాలనీలో కొంత కాలంగా నెలకొన్న తాగునీటి ఇబ్బందులు గురువారం తొలగిపోయాయి. కాలనీలోని తాగునీటి బోరు మోటారు చెడిపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఎమ్మెల్యే వివేక్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన సందర్భంగా గ్రామానికి రాగా స్థానిక నాయకులు సమస్యను ఆయ న దృష్టికి తీసుకువె ళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వివేక్‌వెంక టస్వామి కొత్త మోటా రు మంజూరు చేయించారు. మోటారు బిగిం చడంతో తాగునీటి ఇబ్బందులు తొలగి పోయాయి. కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): ఖాజీపల్లి గ్రామంలో కొత్త బోరు మోటారు ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్ తెలిపారు. గ్రామంలో బోరు మోటారు చెడిపోయి నీటి కోసం కష్టాలు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకు ప్రజలు తెలుపగా బోరు మోటారు మంజూరు చేసినట్లు తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కోటపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయానికి గురువారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, ఆయన తనయుడు పురాణం సాయిరాంకౌశిక్‌లు పుస్తకాలను అందించారు. వివిధ రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల కోరిక మేరకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. 91 పుస్తకాలను శాఖ గ్రంథాలయ అధికారి ఎస్.మురళికి అందించారు. లైబ్రేరియన్ మురళీ, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న ఆపరేషన్ స్మైల్

యేడాది కాలంలో 88 మంది బాలలకు విముక్తి


మంచిర్యాల క్రైం, జనవరి 16 (ఆంధ్ర జ్యోతి): ఆపరేషన్ స్మైల్ సత్ఫలితాల నిస్తోంది. బాలలు పనిలోకాదు బడిలో ఉండా లని, వెట్టి చాకిరిలో బాల్యం మగ్గిపోరాదనే లక్ష్యంతో ప్రభు త్వం చర్యలు చేపడుతోంది. 14 సంవత్సరా లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, వారితో వెట్టి చాకిరి చేయించవడం, వారి స్వేచ్ఛకు భంగం కలిగించడం, నిర్బంధించడం చట్ట రీత్యా నేరం. వీటిని నివారించడానికి 2014లో కేంద్ర ప్రభుత్వం జనవరి 1వ నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పోలీసుల ఆధ్వ ర్యంలో పక్కా కార్యాచరణతో ఈ కార్యక్రమాలను చేపడుతోంది. హోటళ్లలో, ఇటుకబట్టీలు, దుకాణాలు, ఇండ్లలో వెట్టి చాకిరి చేస్తున్న బాల బాలికలను విముక్తి కల్పించడంతో పాటు పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాన్ని రాష్ట్ర పోలీసు శాఖ కార్యాచరణ చేపట్టింది.

గతేడాది మంచిర్యాల జిల్లా పరిధిలో 88 మందిని గుర్తిం చగా అందులో 67 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారు. దీని కోసం రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, ఇతర కూడళ్ల వద్ద ఒక ప్రత్యేక టీముగా ఏర్పడి వారిని గుర్తించి బడిలో చేర్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. కొందరు క్షణికా వేశంలో ఇంటి నుంచి దూరమై బయట తిరుగుతున్న వారిని గుర్తించి అదే అదునుగా వారితో వెట్టి చాకిరి చేయించడం, మిర్చీబండ్ల వద్ద పని చేయించడం వంటివి ఇటీవల ఎక్కువయ్యాయి. ప్రత్యేక యాప్ ద్వారా వీరిని గుర్తించి బడి బాట పట్టించడమే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ లక్ష్యం. వీధి బాలలను, అనాథలను, భిక్షాటన చేస్తున్న వారిని రక్షించడం ఇందులో భాగం. దీని కోసం ప్రత్యేక పోస్టర్లు ఆవిష్కరించి ప్రజల్లో చైతన్యం పెంపొందించడంతోపాటు వివిధ కార్యక్రమాల్లో ప్రజలకు అవగాహన కల్పించడం, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. కొందరు స్కూలుకు వెళ్లకుండా డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించి పనులకు వెళ్లే వారిని గుర్తించి బడి బాట పట్టించడమే ఆపరేషన్ స్మైల్ లక్ష్యం.


పిల్లలను చేరదీసిన ఆపరేషన్ స్మైల్ సిబ్బంది

ఆపరేషన్ స్మైల్ సత్ఫలితాలిస్తున్నాయి

- డీసీపీ ఎగిడి భాస్కర్



యేటా చేపట్టే ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ మంచి సత్ఫలితాలిస్తున్నాయి. తప్పిపోయిన పిల్లలను వెతికి దర్పన్ అప్లికేషన్ ద్వారా వారిని గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరుస్తోంది. ఆపరేషన్ స్మైల్‌లో ఒక అధికారి ముగ్గురు పిల్లలను రెస్క్యూ చేశాం. ప్రతీ పోలీసు డివిజన్ స్థాయిలో ఒక సబ్ ఇన్స్పెక్టర్‌తో పాటు ఒక మహిళా పోలీసు అధికారి, నలుగురు సిబ్బంది వివిధ శాఖలకు చెందిన అధికారులతో నెల రోజులపాటు అదే పనిపై ఇటుకబట్టీలు, వివిధ పరిశ్రమలు, రైల్వే స్టేషన్లు, ట్రాఫిక్ జంక్షన్లలో క్షుణ్ణంగా పరిశీలించి వారిని బడి బాట పట్టించే విధంగా కృషి చేస్తున్నాం. బడి బాట పట్టడం ద్వారా వారికి కొత్త జీవితాన్ని అందిస్తున్నాం.

ముగిసిన జాతర వేలం ప్రక్రియ

రెబ్బెన, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే జాతర వేలం ప్రక్రియ పూర్తిచేసినట్టు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. 11,12,13తేదీల్లో వేలం నిర్వహించగా వేలంలో మొత్తం రూ.20.27లక్షలు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. ఇందులో తైబజార్‌కు రూ.10.92లక్షలు కొబ్బరి కాయాల దుకాణానికి రూ.2.38లక్షలు, ప్రసాదానికి రూ.4.46లక్షలు, పార్కింగ్‌కు రూ.2.21లక్షలు, కొబ్బరి ముక్కలకు రూ.30వేలు వచ్చినట్టు వివరించారు.

ప్రభుత్వ పథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే



అంకుశాపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో చేపడుతున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రైతుభరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యం లేని భూముల వివరాలు నమోదు చేయకూడదన్నారు. వివిధ పథకాలపై ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణ కింద తీసుకున్న భూములకు రైతు భరోసా ఇవ్వకూడదన్నారు. రాళ్లు, గుట్టలు గల భూములను పరిశీలించాలని సూచించారు. రేషన్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో అనర్హులకు ప్రభుత్వ పథకాలు అమలు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహత్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సిబ్బంది ఉన్నారు.

పదోన్నతి పొందిన ఏఎస్సైలను అభినందించిన ఎస్పీ



పదోన్నతి పొందిన ఏఎస్సైలను అభినందిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏఎస్సైలుగా పనిచేస్తున్న జాడేశ్యాంరావు(వాంకిడి), బి యాదగిరి (సిర్పూర్-టి), జి లక్ష్మణ్(రెబ్బెన) ఎస్‌ఐగా పదోన్నతి పొందగా గురువారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి పొందినఎస్సైలకు బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాల న్నారు

వంతెనను పరిశీలించిన ఎమ్మెల్యే



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్మాపూర్ వాగుపై పదేళ్లుగా అసంపూర్తిగాఉన్న వంతెనను గురువారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ల క్రితం నిర్మాణ పనులు మొదలు పెట్టి నేటికీ పూర్తి చేయకపోవడంతో లక్మాపూర్‌తోపాటు ఇతరగ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే పనులు ప్రారంభించి వంతెనను నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.

సిర్పూర్(యు)లో 14.1డిగ్రీల ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 16(ఆంధ్యోతి): జిల్లాలోని సిర్పూర్ (యు) మండలంలో గురువారం 14.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని గిన్నెధరిలో 14.5డిగ్రీలు, తిర్యాణిలో 15.3డిగ్రీలు, కెరమెరిలో 15.4డిగ్రీలు, ధనోరలో15.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● ఇప్పటికే ఓటర్ల జాబితా విడుదల
● గ్రామాల్లో పేరుకుపోతున్న సమస్యలు
● ప్రత్యేక పాలనలో పంచాయతీలకు ఆర్థిక ఇబ్బందులు
● అస్తవ్యస్తంగా గ్రామాలు..
● సిబ్బందికి నెలనెలా వేతనాలు ఇవ్వని పరిస్థితి



పంచాయతీ ఎన్నికల కోసం

ఎదురుచూపులు

చింతలమానేపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరపకపోవడంతో గ్రామాలు అవస్థల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామాలకు ప్రథమ పౌరులు కరువైపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాక పంచాయతీలు నీరసించిపోతున్నాయి. గ్రామపంచాయతీల పదవీ కాలం ముగిసి నెలలు దాటినా ప్రస్తుతం ప్రభుత్వం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నప్పటికీ ఎన్నికలు జరుపుతారా? లేదా? అన్న అనుమానం ప్రజల్లో ఉంది.

ఓ వైపు అధికారులు ఇప్పటికే ఓటర్ల జాబితాను విడుదల చేసి బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడం, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల పరిశీలన, నోడల్ అధికారుల నియామకం, ఆయా సర్పంచులు, వార్డు సభ్యులకు గుర్తులు కేటాయించడం వంటివి చూస్తుంటే ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సర్పంచుల బ్యాలెట్ గులాబీ రంగులో, వార్డు సభ్యుల బ్యాలెట్ తెలుపు రంగు కాగితంలో ముద్రించే పనులకు అధికారులు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తున్నది. దీంతో గ్రామ పంచాయతీల ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల జనాభా తేల్చడానికి పూనుకుంది. ఇప్పటికే కులగణన కార్యక్రమాలు పూర్తి చేసింది.

ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలు..

గ్రామసర్పంచుల పదవీకాలం ముగియగానే మండలాల్లో పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది. ఆయా పంచాయతీల గ్రామకార్యదర్శులతో కలిసి గ్రామంలో సర్పంచుల పాత్ర పోషిస్తున్న ప్రత్యేకఅధికారులు ప్రారంభంలో గ్రామాలకు వెళ్లి ప్రజల సమస్యల తెలుసుకున్నా.

అవి పరిష్కరించడానికి నిధులు లేక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులకు సైతం వేతనాలు ఇవ్వలేని పరిస్థితిలో గ్రామ పంచాయతీలున్నాయి. ఇప్పటికీ 3నెలల వేతనం ఇవ్వాల్సి ఉన్నదని ఆ సంఘం నేతలు చెబుతున్నారు. దీన్నిబట్టి గ్రామ పంచాయతీలు ఆర్థికంగా ఎంత ఇబ్బందిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇక పంచాయతీ కార్యదర్శులు కరెంటు బల్బులు, బ్లీచింగ్ పౌడర్, తదితర వస్తువులు అరువుకు తెచ్చి కాలం నెట్టుకొస్తుండడంతో చిన్న, చిన్న గ్రామపంచాయతీలు కూడా అప్పుల్లో కూరుకు పోయినట్లు తెలుస్తున్నది. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం గ్రామ పంచాయతీల కు(ట్రాక్టర్లను కేటాయించడంతో దీనిపై డ్రైవర్‌తో పాటు పారిశుధ్య సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతీరోజు ట్రాక్టర్ నడపడానికి డీజిల్ డబ్బులు అవసర మవుతున్నాయి. ఇవేమి కూడా ప్రత్యేక అధి కారులు పట్టనట్టు ఉండడంతో కార్యదర్శులు డబ్బులు వెచ్చింది అప్పుల్లో కూరుకుపోతున్నారు.

జిల్లాలో మొత్తం 335 జీపీలు ఉండగా ఓటర్లు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	320	1,15,323	1,15,81	16	2,31,150
ఆసిఫాబాద్	358	1,13,815	1,15,813	16	2,29,644
మొత్తం	678	2,29,138	2,31,624	32	4,60,794

సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలి..

కత్తెర్ల భీమేష్, మండల నాయకుడు



ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీల ఎన్నికలను నిర్వహించాలి. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులు లేకపోవడంవల్ల గ్రామీణప్రాంతాల ప్రజల సమస్యలు నెరవేరడం లేదు. గ్రామాలు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించి ప్రజలకు మెరుగైనపాలన అందించే దిశగా చర్యలు చేపట్టాలి. గ్రామాలకు నెలనెలా నిధులు కేటాయించి అభివృద్ధికి పాటుపడాలి.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి..

సుశీల్ కుమార్, మాజీసర్పంచ్ (రవీంద్రనగర్-2)



గ్రామస్థాయిలో సర్పం చులు సమస్యలు పరిష్క రించడానికి అప్పులు చేసి డబ్బులు పెట్టారు. గతంలో అధి కారంలో ఉన్న ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు ఇవ్వక పోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయారు. ప్రజాప్రభుత్వం మాజీసర్పంచులకు వెంటనే బిల్లులు చెల్లించడంతోపాటు ఎన్నికలు త్వరగా నిర్వహించాలి. మా రవీంద్రనగర్-2 జీపీలోనే సుమారు రూ.5 లక్షల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

గౌడ సమస్యల పరిష్కారానికి కృషి

● మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనీల్‌గౌడ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

తిర్యాణి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గీతాకార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు గౌడజన హక్కుల పోరాటసమితి (మోకుదెబ్బ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనీల్‌గౌడ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి శంకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని రేణుకఎల్లమ్మ ఆలయ ఆవరణలో మోకుదెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్‌తోకలిసి గౌడసంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు లచ్చాగౌడ్, వెంకటేష్ గౌడ్, నర్సయ్యగౌడ్, నారాయణ, బాలేష్ గౌడ్, లచ్చగౌడ్, రాజశేఖర్‌గౌడ్, రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

దహెగాం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సాంఘికశాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉందని అర్హులైన అభ్యర్థులు ఈనెల18లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో రిజ్వానా ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈడీ చేసి టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

వాంకిడి/సిర్పూర్(టి), జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపథకాల సర్వేను పకడ్బందీగా నిర్వహించి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. గురువారం ఆయన వాంకిడి మండలకేంద్రంలో, సిర్పూర్(టి) మండలంలోని గోవింద్‌పూర్‌లో చేపడుతున్న రేషన్ కార్డులు, ఆత్మీయభరోసా, ఇందిరమ్మఇండ్లు, రైతుభరోసా సర్వేలను పరిశీలించారు. రైతు భరోసాకింద రాళ్లగుట్టలు సాగుకు యోగ్యం లేని భూముల వివరాలను నమోదు చేయకూడదన్నారు. నిర్ణీతగడువులోగా సర్వేను పూర్తిచేసి, జాబితాను రూపొందించి గ్రామ సభల్లో ప్రవేశపెట్టాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భూక్య, తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీవో అజీజుద్దీన్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు సోమేష్, కార్యదర్శి శివ, సర్వేయర్ రామకృష్ణ, సిర్పూర్(టి)లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో గిరీష్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపిక సర్వేను గురువారం అదనపు కలెక్టర్ డేవిడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అర్హుల జాబితాను సక్రమంగా రూపొందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ కిరణ్, ఏపీవో బుచ్చయ్య, సిబ్బంది, ఏవోలు, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.



వాంకిడిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్



కెరమెరిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

బెజ్జూరు: ఈనెల 26నుంచి ప్రారంభించే నాలుగు కొత్తపథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21నుంచి గ్రామసభలలో లబ్ధిదారుల జాబితా ఆమోదం పొందాలని సూచించారు. సర్వేలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో గౌరీశంకర్, ఏవో నాగరాజు, ఏపీవో రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి/దహెగాం/తిర్యాణి: మండలాల్లో చేపడుతున్న సర్వేను తహసీల్దార్లు దత్తు ప్రసాద్‌రావు, సూర్యప్రకాష్, ఎంపీడీవోలు అంజద్‌పాషా, రాజేందర్, మల్లేష్ గురువారం పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. రైతుభరోసా పథకంలో భాగంగా సాగుకు యోగ్యంలేని భూముల వివరాలు నమోదు చేయకూడదన్నారు.

వివిధ పథకాలపై ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ కింద తీసుకున్న భూములకు రైతు భరోసా ఇవ్వకూడదన్నారు. రాళ్లు, గుట్టలు గల భూములను పరిశీలించాలని సూచించారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటింటికి వెళ్లి కుటుంబ వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

సర్వేను త్వరగా పూర్తి చేయాలి

● సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



సర్వేను పరిశీలిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్‌టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లిలో గురువారం సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా పరిశీలించారు. ఈసందర్భంగా సర్వేను ఎలాంటి తప్పులు తలెత్తకుండా త్వరగా సర్వేపూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి మహారాజ్ పాదుక పూజ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన జగద్గురు నరేంద్రచార్య రత్నగిరి మహరాజ్ పాదుకయాత్ర గురువారం ఆసిఫాబాద్‌కు చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని తాటిపల్లి నారాయణ ఇంట్లో పాదుకదర్శనం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాదుకలను దర్శించుకుని పూజలు నిర్వహించారు.



పాదుక పూజల్లో పాల్గొన్న భక్తులు

పోతరాజు ఆలయానికి పోటెత్తిన భక్తులు

● మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కెరమెరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందాపూర్ గ్రామసమీపంలో గల పోతరాజు ఆలయానికి భక్త జనం పోటెత్తింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె గిరిజన సంప్రదాయ రీతిలో ప్రత్యేకపూజలు చేపట్టారు. మహా జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్రనుంచి సైతం భక్తులు భారీగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనులు తమ సంప్ర దాయ రీతిలో లక్ష్మీపూజ చేశారు. పోతరాజు ధర్మరాజు, ఇతర దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి నవ. దాన్యాలతో కూడిన నైవేద్యాన్ని సమర్పించారు. కొత్త నువ్వుల నూనెతో దీపం వెలిగించారు. అలాగే ప్రతియేటా ఇక్కడ నిర్వహించే కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మోతీరాం, మాజీ జడ్పీటీసీ ద్రుపతాబాయి, మాజీ వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సత్యనారాయణ, ఎస్సై విజయ్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు సిడాం రాజు, సిడాం ధర్ము, పాండు రంగు, రాము, ఆత్రం ఆనంద్ రావు, సిడాం వంశీయులు, తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నవోదయ విద్యాలయ ఆరో తరగతి ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కాగజ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల18నఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా వ్యాప్తంగా నిర్వహించే నవోదయ విద్యాలయ 6వతరగతి ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రిన్సిపాల్ కొడాలి పార్వతి తెలిపారు. గురువారం నవోదయ విద్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడిజిల్లా నుంచి 5191విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు ఉదయం 9 నుంచి అనుమతిస్తామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. సమావేశంలో ఓరియంటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కొడాలి పార్వతి

వాలీబాల్ టోర్నమెంట్ విజేత సోనాపూర్

వాంకిడి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వాలీబాల్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో మండలానికి చెందిన సోనాపూర్ జట్టువిజేతగా నిలిచింది. మొత్తం 21జట్లు పాల్గొనగా సోనాపూర్, వాంకిడి శివఎలెవన్ జట్లు ఫైనల్‌లో తలపడగా సోనాపూర్ విజేతగా నిలిచింది. విన్నర్, రన్నర్లకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వాలీబాల్ క్లబ్ చైర్మన్ దీపక్‌ముండే, కాంగ్రెస్‌నాయకులు ప్రశాంత్, అంబేద్కర్ సంఘం నాయకులు విలాస్, సందీప్, ప్రతాప్, నిర్వాహకులు శ్రావణ్, అఖిల్, రాకేష్‌తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

వేతనాలు వెంటనే చెల్లించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉపేందర్, శంకర్, శ్రీశైలం, సిబ్బంది గుణవంతరావు, మారుతి, నీల, కమల తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

విజేతలకు బహుమతుల ప్రదానం

పెంచికలపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి గ్రామంలో మాజీసర్పంచ్ సుజాత శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. ప్రథమబహుమతి మల్లంపేట, ద్వితీయ బహుమతి చెడ్వాయి జట్లు గెలుపొందాయి. విజేతలకు తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో ఆల్బర్ట్, ఎస్సై కొముురయ్య, ఎంఈవో రమేష్‌బాబు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐసురేష్, నాయకులు సత్త న్న, వెంకటేష్, ఆబు, మహేష్, మోహిన్, నరేష్, ఉపాధ్యాయులు రాజ్‌కమలాక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు